# చుప్పనాతి పెట్టిన చిచ్చు

పండు వెన్నెల. మందమారుతం. మెత్తని పరుపు. ఎటు చూచినా, పచ్చపచ్చని చెట్టుచేమలు.

శూర్పణఖ మాత్రం నిద్ర పోలేదు. ఎంత ప్రయత్నించినా కళ్లు మూత పడలేదు. 'అంతా ఆ సీత మూలంగా జరిగింది' అంటూ మంచం మీదినుంచి లేచి కూర్చుంది. అంతే నిద్ర మత్తు కూడా పోయింది.

సీతమీద మరులుగొన్న కారణంవల్లనే గదా వీరాధివీరుడైన మా అన్నయ్య రావణుడు ఈలోకం నుంచి నిష్క్రమించవలసి వచ్చింది. రామరావణ యుద్ధంలో ఎందరో రాక్షసవీరులు విగత జీవులయ్యారు. చివరికి కలకలలాడే లంకారాజ్యం సర్వనాశనమై పోయింది. లంక! ఎంత సుందర మయింది! ఆ సిరిసంపదల్ని తలచుకుంటేనే గుండె చెరువైపోతోంది.... శూర్పణఖ మానసికంగా బాధ పడింది. ఆమె మనస్సు వికలమై పోయింది.

ఉన్నట్టుండి ఆమె అంతరాత్మ 'ఆ సీత సౌందర్యాన్ని నువ్వేగదా దశకంఠుడికి తెలిపి పాపం మూటకట్టుకున్నావు' అంది. దాంతో 'యుద్ధానికి కారకురాల్ని నేనే.' ఈ మాటలు తలవని తలంపుగా ఆమె నోటినుంచి వెలువడ్డాయి. అయితే యీసారి ఆమెలో బాధ ఏమాత్రమూ లేదు. దానికి బదులుగా ఈర్ష్య మనస్సుని ఆక్రమించింది. తత్ఫలితంగా మరీ పిచ్చిదైపోయింది. యుక్తాయుక్త జ్ఞానాన్ని కోల్పోయింది. సీత అంటే భగ్గున మండి పడసాగింది.

రావణుడు మరణించిన తర్వాత లంకారాజ్యం పతనమైన తర్వాత... సీత అయోధ్యా నగరంలో రాజ్యభోగాలు అనుభవిస్తూ హంసతూలికా

తల్పాన నిశ్చింతగా శయనించడమా! చుప్పనాతితనం శూర్పణఖని వశం చేసుకుంది; పశువుగా మార్చివేసింది.

ఆ రాత్రి ఎలాగో గడిచిపోయింది.

మామూలుగానే సూర్యోదయ మయింది. అయితే శూర్పణఖ పూర్వపు శూర్పణఖ కాదు; వికృత రూపిణి అదు. యోగిని! ఆ కాషాయాంబరాలు... మెడలో ఆ రుద్రాక్షమాలలు... చేతిలో కమండలం.... నుదుట విభూతి రేఖలు... అచ్చం యోగినిలా ఉంది... శివభక్తురాలిగా దర్శనమిచ్చింది. ఆమె యిప్పుడు శూర్పణఖ అంటే బాగా తెలిసిన వాళ్లు కూడా నమ్మరు.

'ఎక్కడికమ్మా అంత త్వరత్వరగా వెడుతున్నారు!' అడిగింది చెలికత్తె భయంభయంగా.

'శకునపక్షి! నీ పని చూసుకో!'

శూర్పణఖ చరచర వెడుతోంది. ముఖంలో ప్రశాంతత లోపించింది. కళ్లు చింతనిప్పుల్లా ఉన్నాయి.

అయోధ్యా నగరంలో ఆమె అడుగు పెట్టేసరికి బారెడు పొద్దెక్కింది. నగరంలో ఎటు చూచినా నవ చైతన్యం. పౌరులు విద్యుక్తధర్మనిర్వహణలో మునిగిపోయారు. వారంతా ఎంత సంతోషంగా తృప్తిగా ఉన్నారని! ఏడుపు ముఖం ఒక్కటైనా కనిపించలేదు. అది చూచే సరికి, ఆమెకు కన్ను కుట్టింది. ద్వేషభావం నరనరాలా వ్యాపించింది.

యోగిని వేషంలో ఉన్న శూర్పణఖను నగర పౌరులు ఆదరపురస్సంగా విలోకించారు. చేతులెత్తి నమస్కరించారు. ఒక్కక్షణం తన్ను తాను విస్మరించింది. ఎన్నడూ కలగని తృప్తి సంతోషం కలిగాయి ఆమెకు. అది రామరాజ్యం మహిమ కాబోలు అనుకుంది.

వెంటనే తాను వచ్చిన పనిని గుర్తు చేసుకుంది.

రాచనగరు వైపు నడిచింది. ఆ వీధుల అందచందా లేవీ ఆమెకు కనిపించలేదు.

ఎవరో యోగిని తనను దర్శించడానికి వస్తున్న విషయం అంచెలు అంచెలుగా రాముడిదాకా పాకింది. ఎక్కడికో బయలుదేరిన ఆ రాజు ఆమె

సందర్శనం చేసుకుని వెడదామనుకున్నాడు. ఆమె రాకకోసం వెయ్యికళ్లతో నిరీక్షించసాగాడు.

అంతలో రాజభటులు యోగినిని రాముడి వద్దకు సగౌరవంగా తీసుకు వచ్చారు. రాముడు సభక్తికంగా అర్ఘ్యపాద్యాదులు నిర్వర్తించాడు. ఆమెను ఉద్దేశించి కుశల ప్రశ్నలువేశాడు.

రాముడిని చూడగానే యోగిని అవాక్కయింది. అతని జగన్మోహనాకారాన్ని తిలకిస్తూ శిలాసదృశగా మారింది. సీత అంటే ఈర్ష్య ముంచుకు వచ్చింది. 'సీత వద్దకు తీసుకు వెళ్లండి' అని ఆజ్ఞాపించి, యోగిని వద్ద అనుజ్ఞతీసుకుని పరివార సమేతుడై రాముడు వెళ్లిపోయాడు.

సీత నివసించే మందిరం ప్రవేశించింది యోగిని. ఆమె చేసిన సపర్యలకూ, చూపిన భక్తిభావానికీ పరమానందం చెందింది. అన్నెమూ పున్నెమూ ఎరుగని ఆ అమాయకురాలికి అపకారం తలపెట్టడం అవాంఛనీయం మనుకుంది. పాపమని తలచింది. వచ్చిన దారినే వెడదామనుకుంది. మరుక్షణంలోనే శూర్పణఖ అయింది.

యోగిని సమక్షంలో రకరకాల స్వాదుఫలాలూ రంగురంగుల పట్టుపుట్టాలూ ఎన్నో సీత ఉంచింది. స్వీకరించి అనుగ్రహించండి -అన్నట్టుగా చూచింది. వాటిమీద యోగిని దృష్టి పడలేదు; తుచ్ఛమని భావించినట్టుగా చూచింది. ఆమె తృప్తి చెందకపోవడం గుర్తించి, తన వల్ల ఏం అపచారం జరిగిందో అని సీత తల్లడిల్లి పోయింది. అందువల్ల భర్త తనను అపార్థం చేసుకుంటాడేమోనని భయపడింది.

'అమ్మా! తమ కోరిక యేమిటో సెలవిస్తే నెరవేర్చడానికి శాయశక్తులా ప్రయత్నిస్తాను' అంది సీత, సవినయంగా.

యోగిని ముఖంలో సంతోషం ప్రస్ఫుట మయింది. కాని మౌనం వహించింది.

భయపిశాచం సీతను మళ్లీ ఆవహించింది. 'నా వల్ల తమకు ఎలాంటి అపచారమూ జరగలేదు గదా! తమ వంటి పెద్దల్ని సంతృప్తి పరిచి అనుగ్రహం పొందడమే మా ఆశయం.'

యోగిని మందహాసం చేసింది.

సీతకదే పదివేలుగా తోచింది.

'నాకు వస్తువాహనాలేవీ అక్కరలేదు. వాటిని ఏం చేసుకుంటుందని నావంటి యోగిని! నా ప్రశ్నలకు బదులు చెపితే చాలు. అదే నేను కోరేది.'

'తమ చిత్తం నా భాగ్యం'.

'రావణుడి చెరలో ఎన్నాళ్ళున్నావు?

పిడుగులు పడ్డట్టుగా తోచింది సీతకు. రావణుడి పేరు వినగానే ఒంటి మీద తేళ్లూ జెర్రులూ పాకినట్లనిపించింది. జడలు విరబోసుకున్న దయ్యాన్ని చీకట్లో చూసినట్టుగా భావించింది. ఏమిటీ ప్రశ్న! అనుకుని తెల్లబోయారు ఆమె చెలికత్తెలు.

'లంకలో ఎన్నాళ్లున్నావు?' మళ్లీ వినిపించింది.

యోగిని అడిగే ప్రశ్నేనా యిది – అనుకుంటూనే సీత అనిష్టంగా చెప్పింది. 'సుమారు పది నెలలు.'

మౌనం అలుముకుంది.

'సీతా!'

'ఊఁ'

'రావణుడు ఎలా ఉండే వాడో చెబుతావా? వినాలని వుంది.' సీత నిర్ఘాంత పోయింది. నవనాడులూ క్రుంగి పోయాయి. ఈమె నిజంగా యోగినా కాదా అనే సందేహంలో పడింది.

'నువ్వు నీనోటితో చెప్పవద్దుగాని, ఎలా వుండేవాడో బొమ్మవేసి చూపించు. అది చాలు...'

సీతకి సహనం నశించింది. ధైర్యమంతా కూడగట్టుకుని 'ఆ దుర్మార్గుణ్ణి నేను కన్నెత్తి కూడా చూడలేదు' అంది.

దేవతా విగ్రహాన్ని దర్శించినట్టుగా చూచారు చెలికత్తెలు.

యోగిని అయితే హతాశురాలయింది. అయినా తెచ్చుకున్న ధైర్యంతో, విషపు నవ్వు ఒలకబోస్తూ, 'నా సంతోషం కోసం గుర్తున్నంతవరకూ బొమ్మను గీస్తే చాలు.' అర్థించింది.

'పాపం యోగిని అంతగా అడుగుతుంటే, బొమ్మ వేసి చూపించకూడదా?' అంది చనువుగా ఒక చెలికత్తె.

'ఆ పదితలలవాడు ఎలా వుంటాడో మాకూ చూడాలని వుంది' మరో చెలికత్తె పలికింది.

యోగిని అప్పుడు ధైర్యంగా అంది. 'చూచావా అమ్మా, మీ చెలికత్తెలు ఎంతగా ముచ్చట పడుతున్నారో!'

'ఆ నీచుణ్ణి కన్నెత్తి చూడందే నేనేం రాయను బొమ్మ' అంటూ చెలికత్తెల్ని చురచుర చూస్తూ, రావణుడి బొటనవేలు మాత్రం రాసింది సీత.

అది తీసుకుంది యోగిని. వచ్చిన పని పూర్తి అయిందన్న సంతోషం కొద్దీ, భుజాలు ఎగర వేసుకుంటూ వెళ్లిపోయింది –సీత వద్ద అనుజ్ఞ తీసుకుని.

ఆ తర్వాత శూర్పణఖ రావణుడి బొమ్మను పూర్తి చేసింది. ఆ చిత్రానికి ప్రాణదానం చెయ్యమని బ్రహ్మను ప్రార్థించింది. జాలిపడి సరే అన్నాడు బ్రహ్మదేవుడు. రెండో కంటికి తెలీకుండా శూర్పణఖ ఆ బొమ్మను తీసుకు వెళ్లి సీత మంచం మీద దిండు కింద ఉంచింది. తన దారిని తాను వెళ్లిపోయింది. తన కోరిక నెరవేరు తుందనే సంతృప్తికొద్దీ మరీ వెళ్లిపోయింది.

అలా శూర్పణఖ వెళ్లిపోయిన కొంత సేపటికి రాముడు అంతఃపురానికి వచ్చాడు. రావణుడి చిత్రం వెయ్యమని యోగిని సీతను వేధించుకు తిన్న విషయాన్ని ఎవ్వరూ ధైర్యం చేసి రాముడికి విన్నవించలేదు. విన్నవిస్తే ఆయన యేమనుకుంటాడో యేమో అనుకుని సందేహించారు. చెప్పాలని సీతకూ అనిపించలేదు.

ఆ రాత్రి సీత తన శయ్యామందిరం చేరుకుంది. ఆమె వెనకాలే రాముడూ వచ్చాడు.

సీత మంచం దగ్గరికి రాగానే, 'రా, లంకకు రా' అనే మాటలు వినవచ్చాయి. మొదట నిర్ఘాంతపోయింది. తర్వాత భయభ్రాంత అయింది. గజగజ వణికిపోయింది. రాముడు ఆశ్చర్యచకితుడయ్యాడు.

'రా, లంకకు రా' అని మళ్లీ వినిపించింది, స్పష్టంగా.

కాళ్లకింది నేల కంపించింది సీతకి. దారీ తెన్నూ తోచలేదు. భర్తను మనస్సులో ధ్యానించుకుంది.

దిండుకింది బొమ్మ మౌనం వహించింది.

పీడ విరగడ అయినందుకు సీత సంతోషించింది.

ఇదంతా రాముడిని వింతగా తోచింది. ఎన్నడూ యిలా జరగలేదు. మంచం మీది పరుపు సూక్ష్మంగా చూశాడు. పరిసరాలు పరికించాడు. దిండుని పైకి తీశాడు. రావణుడి బొమ్మ!

ప్రసన్న వదనుడైన రాముడు ప్రళయకాల రుద్రుడయ్యాడు!

ఆ భయంకరమూర్తిని క్షణకాలం పాటైనా చూడలేక పోయింది సీత. నేలమీది చేపపిల్లలా మనస్సు గిలగిల కొట్టుకుంది. ఎలా ఆ బొమ్మ తన శయ్యాగృహంలోకి వచ్చింది? ఆలోచించే శక్తిని కోల్పోయింది. శోకర సాధిదేవత అయింది.

'ఏ పాపము నేను ఎరగను... ఆ దుర్మార్గుడి బొమ్మ యిక్కడికెలా వచ్చిందో తెలీదు...' సీత దుఃఖం ఆపుకోలేకపోయింది. 'పొద్దున మీరు పంపించిన యోగిని కుట్ర కావచ్చు యిదంతా. ఆమె యోగినిగా కనిపించలేదు...' అంటూ ఆ వింత కోరికను తెలపలేక తెలిపింది.

రాముడి కేమీ వినిపించలేదు. భార్యను సందేహించాడు.

రెప్పపాటులో అంతఃపురం యావత్తూ అంధకారబంధుర మయింది. ఉదయం జరిగిన వివిధ విషయాలు సీత చెలికత్తెలు విన్నవించారు. సీత నిర్దోషి అన్నారు.

ఎవరి మాటలూ వినిపించుకునే స్థితిలో లేడు రాముడు. మనస్సు సందేహపు ముద్ద! అంతఃపురాంగనలు జీవచ్ఛవాలులా గోచరించారు.

సీత కళ్లల్లో ఒక్క నీటి చుక్క కూడా మిగలలేదు. చలనం లేని ఆకృతిగా కనిపించింది, ఆ బంగారు బొమ్మ!

క్షణక్షణం చింతనిప్పులవుతున్న ఆ నీలమేఘశ్యాముని నయనాలను అక్కడున్న వారెవ్వరూ చూడలేక పోయారు.

'లక్ష్మణా!' అన్నాడు మిన్ను విరిగి మీద పడ్డట్టుగా తోచింది; వెయ్యి పిడుగులు ఒక్కసారిగా గర్జించినట్టు వినిపించింది. వందలకొద్దీ పెనుతుఫానులు వీచినట్టు తోచింది.

'అన్నయ్యా!' భయభ్రాంతుడైన లక్ష్మణుడు అగ్రజుణ్ణి సమీపించాడు, అడుగులో అడుగు వేసుకుంటూ.

రాముడు ఏమిటో చెప్పాడు. రామానుజుడు తల వంచుకున్నాడు, కళ్లల్లో నీరు తిరుగుతుంటే. మారు మాట పలక్కుండా, వంచిన తలను పైకెత్తకుండా అతను వెనక్కి తిరిగాడు.

అంతఃపుర ప్రాంగణంలో ఎక్కడో గుడ్లగూబలు వెక్కిరిస్తున్నట్టు కనిపించాయి. ఎవ్వరో విషపు నవ్వులు నవ్వుతున్నట్టు అనిపించింది.

ఆ రాత్రి ఎలా గడిచిందో యేమిటో!

ఆ మరునాడు,

'సీత చూలాలు...'

'ఆ సాధ్విని అనవసరంగా సందేహించడం ధర్మం కాదు...'

'ఏ పాపమూ ఎరగని స్త్రీని ఇలా కష్టాలపాలు చెయ్యడం ప్రభువులకు న్యాయం కాదు...'

అంతఃపురాంగనల ఈ మాటలు -దీనాలాపాలు- ప్రత్యూష పవనాలలో కలిసిపోయాయి.

ముందు లక్ష్మణుడు.. వెనక సీత... రథం అడవుల వైపుగా వెడుతోంది.

రాముడు సింహాసనం మీద ఆసీనుడై కనిపించాడు దిష్టిబొమ్మలా!

(చూలాలని కూడా చూడకుండా రాముడు సీతను అడవులకు పంపిన కథాఘట్టం కరకు గుండెను కూడా కరిగిస్తుంది. సీతా పరిత్యాగానికి శూర్పణఖ కారణమైనట్లు తెలుగు తమిళ జానపద కవులు కొందరు భావించారు. 17వ శతాబ్దికి చెందిన బెంగాలీ కవయిత్రి చంద్రావతి కూడా సీతా పరిత్యాగానికి కారణం ఆమె చేసిన రావణ చిత్రరచన అని తెలపడం పేర్కొనదగిన అంశం. అయితే ఆ కవయిత్రి కథనం ప్రకారం చిత్ర రచనకు పురికొల్పింది శూర్పణఖ కాదు, కైకేయి కుమార్తె అయిన కుకియి!)